సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
7
శనివారం । 6 । జనవరి । 2024

న్యూస్‌రీల్

సక్రమంగా సరకుల పంపిణీ

- పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశం



గడుగుపల్లిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

హుకుంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సరకులను సక్రమంగా సరఫరా చేయాలని సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశించారు. మండలంలోని గడుగుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌లో తూనికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

8న ఆంధ్రా ఉద్యోగుల సమస్యలపై గ్రామసభ

- మాచ్‌ఖండ్‌లో ఏర్పాటు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 8న మాచ్‌ఖండ్‌లో గ్రామసభ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రా కాంట్రాక్ట్ ఉద్యోగులు, మన ప్రాంత నిరుద్యోగ యువత శేషాద్రి, మదీనా, జయరాం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు మాచ్‌ఖండ్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు పోగొట్టుకున్నారన్నారు. దీనిపై ఎన్నో సంవత్సరాల పోరాటానికి ఫలితంగా ఐదుగురికి కాంట్రాక్ట్ పద్ధతిలో మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పించారన్నారు. తాము విధులకు వెళ్తే ఆంధ్రాకు చెందిన వారంటూ దాడులకు పాల్పడుతున్నారని, దీనివల్ల భయపడుతూ పనిచేయాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర,ఒడిశా సరిహద్దు గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులు,ఉద్యోగులు సమక్షంలో సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా ఈ గ్రామసభను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు.

డోలీలో బాలింత తరలింపు



డోలీలో తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: తీవ్ర అస్వస్థతకు గురైన బాలింతను డోలీలో ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మారుమూల గుమ్మ పంచాయతీ కర్రిగుడ గ్రామానికి చెందిన సారా గంగమ్మ మూడు నెలల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. కాళ్లు చేతులు వాపుల కారణంగా శుక్రవారం ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చేపరిస్థితి లేదు. దీంతో ఆమె భర్త గంగులు కుటుంబ సభ్యుల సాయంతో శిశువుతో బాలింతను కర్రిగుడ నుంచి దట్టమైన అటవీ ప్రాంతం గుండా సుమారు ఎనిమిది కిలోమీటర్లు డోలీలో గుమ్మ వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఘోషాస్పత్రికి తరలించారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉందాం

- మాజీ మంత్రి బాలరాజు



అనుచరులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉందామని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అనుచరులకు సూచించారు. బాలరాజు నర్సీపట్నంలో ఉన్నారన్న విషయం తెలుసుకుని కొయ్యూరు, చింతపల్లి మండలాల పరిధిలోని ఆయన అనుచరులు కలిశారు. ఇటీవల పార్టీ అధిష్టానం ప్రకటించిన ఇన్‌చార్జిల్లో చోటు కల్పిస్తారని ఆశించామని అనుచరులు బాలరాజు వద్ద ప్రస్తావించారు. ఎవరూ అధైర్య పడవద్దని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉందామని బాలరాజు అనుచరులకు స్పష్టం చేశారు.

చెరువులకు అమృత్ యోగం

జిల్లాలో సాగునీటి చెరువులకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ అమృత్ సరోవర్ పథకంలో వీటి అభివృద్ధికి ఉపాధి హామీ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే సుమారు రూ.ఆరు కోట్ల నిధులు వెచ్చించి 88 చెరువులను అభివృద్ధి చేశారు. మిగతా చోట్ల కూడా పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

- మిషన్ అమృత్ సరోవర్‌లో 200 చోట్ల అభివృద్ధికి కార్యాచరణ
- ఇప్పటికే 88 పనులు పూర్తి
- ఒక్కొక్క చెరువు పరిధిలో 200 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు
- మెరుగుపడుతున్న భూగర్భ జలాలు
- అన్నదాతకు తప్పనున్న సాగునీటి కష్టాలు



అభివృద్ధి అనంతరం నీటితో కళకళలాడుతున్న పాడేరు మండలం తుంపాడలోని పెద్ద చెరువు

పాడేరు : జిల్లాలో అమృత్ సరోవర్ పథకంలో కొత్త చెరువుల తవ్వకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో వీటి తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. చెరువులు లేని చోట ఎకరా స్థలంలో కొత్త చెరువుల నిర్మాణం చేపట్టారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో తవ్వకాలకు ప్రాధాన్యమిచ్చారు. కొత్త చెరువుల తవ్వకానికి స్థలం దొరకని చోట పాత వాటిని ఆధునికీకరిస్తున్నారు. ఇప్పటికే 50 నుంచి 100 ఎకరాల ఆయకట్టు ఉన్న జిల్లాలో సుమారు 200 చెరువులను ఎంపిక చేశారు. ఈ పనులకు కలెక్టర్ నుంచి ఆమోదం లభించింది. జిల్లా వ్యాప్తంగా 200 చెరువుల్లో పనులు ప్రారంభం కాగా ఇప్పటివరకు 88 చోట్ల రూ.6 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేసినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. ఉపాధి హామీ వేతనదారులతోనే ఈ చెరువులు తవ్వకం పనులు చేపట్టారు.

- అమృత్ సరోవర్ చిన్న చెరువుల్లో కనీసం ఎకరా విస్తీర్ణంలో 1500 క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా పనులు చేపడుతున్నారు. ఎకరాకు పైగా ఉన్న పెద్ద చెరువులో విస్తీర్ణం బట్టి రూ.15 నుంచి 28 లక్షలు వెచ్చిస్తున్నారు. దీనివల్ల సుమారు 3,500 క్యూబిక్ మీటర్ల నిల్వ సామర్థ్యం పెరుగుతుందని ఉపాధి హామీ అధికారులు తెలిపారు.
- ప్రతి అమృత్ సరోవర్ (చెరువు) చుట్టూ వేప, పీపల్ మరియు మర్రి మొదలైన చెట్ల పెంపకానికి ఉపాధి హామీ అధికారులు ప్రతిపాదించారు.



చెరువు అభివృద్ధి పనులు వివరాల బోర్డు

- ప్రతి అమృత్ సరోవర్‌ను నీటిపారుదల, చేపల పెంపకం, వాటర్ టూరిజం మరియు ఇతర కార్యకలాపాలకు ఉపయోగించడం ద్వారా జీవనోపాధికి మూలం అవుతుంది. అమృత్ సరోవర్ ఆ ప్రాంతంలో ఒక సామాజిక కలయికగా కూడా పనిచేస్తుంది.
- పాడేరు మండలం తుంపాడలో ఎకరా విస్తీర్ణంలో పెద్ద చెరువును అభివృద్ధి చేశారు. ఇందుకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల నిధులను వెచ్చించారు. దీనివల్ల సుమారు 200 ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

అత్యధికంగా రాజవొమ్మంగి మండలంలో..

జిల్లాలోని అడ్డతీగల మండలంలో 17 చెరువులకు నిధులు మంజూరు కాగా ఇప్పటివరకు 6 చోట్ల పనులు పూర్తయ్యాయి. అనంతగిరి మండలంలో మూడింటికి ఒకటి, అరకువేలీ మండలంలో నాలుగింటికి రెండు పూర్తయ్యాయి. మారేడుమిల్లి మండలంలో ఒకటి, చింతపల్లి మండలంలో ఐదు, ముంచంగిపుట్టు మండలంలో ఆరు చెరువులు, గూడెంకొత్తవీధి మండలంలో ఒకటి అభివృద్ధి దశలో ఉన్నాయి. చింతూరు మండలంలో 18 చెరువులకు 8, దేవీపట్నం మండలంలో 20 చెరువులకు 11, డుంబ్రిగుడ మండలంలో ఒక చెరువు పూర్తయింది.

- గంగవరం మండలంలో 19 చెరువులకు ఐదు, హుకుంపేట మండలంలో ఆరింటిలో ఒకటి, కొయ్యూరు మండలంలో పది చెరువుల్లో రెండు, కూనవరం మండలంలోని తొమ్మిది చెరువుల్లో నాలుగు చోట్ల పనులు పూర్తయ్యాయి. నెల్లిపాక మండలంలో 15 చెరువులకు ఐదు, పాడేరు మండలంలో నాలుగింటిలో ఒకటి, రాజవొమ్మంగి మండలంలో 32 చెరువులకు 26, రంపచోడవరం మండలంలో 12 చెరువులకు ఆరు, వీఆర్‌పురం మండలంలో 17 చెరువులకు తొమ్మిది చోట్ల పనులు పూర్తయ్యాయి.

గడువులోగా పూర్తి చేస్తాం

మిషన్ అమృత్ సరోవర్ పథకం లక్ష్యం నెరవేర్చడమే లక్ష్యంగా పనులు చేపట్టాం. జిల్లాలో 88 చోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం విధించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికపరంగా చర్యలు చేపట్టాం. అభివృద్ధి చేసిన పనులకు సంబంధించి ఇప్పటికే బిల్లులు చెల్లించాం.

– జి.గిరిబాబు, అడిషనల్ పీడీ, ఎన్ఆర్ఈజీఎస్, పాడేరు

అవ్వాతాతలకు అండగా ప్రభుత్వం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- పింఛను కానుక పంపిణీలో పాల్గొన్న పాడేరు సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛను అందజేస్తున్న భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరరాజు



రంపచోడవరంలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతపల్లి రూరల్ : అవ్వా,తాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోంది పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛను పెంచి నెలకు రూ.3 వేల చొప్పున చెల్లించిన ఘటన ఘనత తమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో అవ్వా,తాతలను ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పేదన్నారు. తమ ప్రభుత్వంలో అలా కాకుండా పింఛనుదారుల ఇంటికి నేరుగా వలంటీర్లు వెళ్లి అందజేస్తున్నారన్నారు. చింతపల్లి మండలంలోని 17 పంచాయతీల్లో ఏడాదికి 9700 మందికి రూ.34 కోట్ల 92 లక్షలను ప్రభుత్వం అందించిందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ పార్టీలకు, మతాలకు అతీతంగా తమ ప్రభుత్వం పింఛను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛనుదారుల్లో ఎవరైనా చనిపోతేనే కొత్తవారికి పింఛను వచ్చేదన్నారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా అన్ని పథకాలను పేదలకు పారదర్శకంగా అందిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వారు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ శారద, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి,కోఆప్షన్ సభ్యులు నాజర్ వల్లీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నూరుశాతం హామీల అమలు: రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులతో కలిసి పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఏజెన్సీలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్టు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేందుకు కృషి చేశామన్నారు. మండలంలో 4597 పింఛన్లు ఉండగా కొత్తగా 81 పింఛన్లు మంజూరు అయినట్టు చెప్పారు. ఏజెన్సీలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తారన్నారు. పాదయాత్రలో గిరిజనుల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతో కాలంగా గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేశారన్నారు. ఆ భూముల్లో పంటలు పండించుకునేందుకు రైతు భరోసా అమలు జరుగుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరంలో రూ. 50 కోట్ల వ్యయంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఏజెన్సీలో రూ. 160 కోట్ల వ్యయంతో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, పండా రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్నాల పథకాలు

- జిల్లాలోని 2,608 మందికి జమ
- రూ.2.72 కోట్ల మేర లబ్ధి
- జాయింట్ కలెక్టర్ కార్తీక్



నమూనా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

సాక్షి,పాడేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు న వరత్నాల పథకాల ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాల పథకాల లబ్ధిదారులకు ఆర్థికసాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో జేసీతో పాటు లబ్ధిదారులు వీక్షించారు.అనంతరం జిల్లాలోని 2608మందికి రూ.2కోట్ల 79లక్షల 42వేలు పంపిణీకి సంబంధించిన నమూనా చెక్కును జేసీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈబీసీ నేస్తం,అమ్మ ఒడి,జగనన్న చేదోడు,వైఎస్సార్ కల్యాణమస్తు,వాహనమిత్ర పథకాలను సాంకేతిక సమస్య కారణంగా నోచుకోని వారికి ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. దీనివల్ల లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లాలోని 1100 మందికి కొత్తగా వైఎస్సార్ పింఛన్‌కానుకను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్షతో సత్వర వైద్యం
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మందుల కిట్‌ను గిరిజనులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి, పాడేరు: గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని చింతలవీధి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు,. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదప్రజలకు సత్వర వైద్యం అందుతుందన్నారు. మొదటి దశలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతమయ్యాయని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 95వేల పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించినట్టు చెప్పారు.వైద్యనిపుణులతో పరీక్షలు నిర్వహించడంతో పాటు దీర్ఘకాలికంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఉన్నత వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అన్ని రకాల వైద్యపరీక్షలు ఉచితంగా జరపడంతో పాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. రక్తహీనత సమస్యలు పరిష్కారానికి ఈశిబిరాలు దోహదం పడుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.

230 మందికి వైద్యపరీక్షలు

చింతలవీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా పర్యవేక్షణలో 230మంది పేదలకు నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యసేవలు పొందిన రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను ఎమ్మెల్యే, డీఎంహెచ్‌వో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతాల సీతమ్మ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర తదితరులు పాల్గొన్నారు.

గడుగుబిల్లిలో 139 మందికి...

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మారుమూల గిరిజనులకు ఉన్నత వైద్యసేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. గిరిజనులతో మాట్లాడారు. వైద్యశిబిరంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. 139 మందికి వైద్యసేవలు అందించినట్టు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, వైద్యాధికారి డా.సౌమ్య,సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం పాల్గొన్నారు.

జన్‌మన్‌తో పీవీటీజీ గ్రామాల అభివృద్ధి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్ సింగ్



విల్లు ఎక్కిపెట్టిన మనోజ్‌కుమార్ సింగ్



గిరిజన మ్యూజియంలో థింసా కళాకారులతో మనోజ్ కుమార్ సింగ్

అరకులోయ టౌన్: జన్‌మన్ పథకలో ఆదివాసీ (పీవీటీజీ) గిరిజన గామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సంపూర్ణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తభల్లుగుడ గ్రామంలో జరిగిన జన్‌మన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాల గిరిజనులకు ఉచితంగా ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ప్రతీ ఇంటికి విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 1597 పీవీటీజీ గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేశామన్నారు. ఉచిత వైద్యం పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీపథకం ద్వారా రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తుందన్నారు.ఈనెల 15వ తేదీన జనమన్‌పథకాన్ని పీఎం ప్రారంభిస్తారన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు పథకాలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పక్కా గృహానికి రూ. 2.39 లక్షల చొప్పున చెల్లిస్తామన్నారు. అనంతరం ఆయుష్మాన్ కార్డులకు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గిరిజనులు మనోజ్‌కుమార్‌సింగ్‌కు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. అంతకు ముందు ఆయన పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. గార్డెన్‌లో మొక్కలు నాటారు. ట్రీ కాటేజీలను పరిశీలించారు. కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల సందర్శించి భోజన, వసతి సదుపాయాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్ ప్రభాకర్, ఎం. వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ బి. బాబు, ఈఈ జె. లావణ్యకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లావణ్యకృష్ణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మీ, ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచ్ కొర్రా రాధిక పాల్గొన్నారు.

సాగరతీరాన సాంస్కృతిక వైభవం

- ఏయూలో ప్రారంభమైన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్



8లో

123 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

పద్మనాభం: ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి కారులో విశాఖపట్నం తరలిస్తున్న రూ.6లక్షలు విలువ చేసే 123 కిలోల గంజాయిని శుక్రవారం విజయానందపురం జంక్షన్‌లో పట్టుకున్నారు. సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సమీపంలోని పద్మాపురానికి చెందిన కొర్రా గోపాల్, పట్నాయక్ రవి నాయక్, హుకుంపేట మండలం గన్నేరుపుట్టుకు చెందిన పంగి వర ప్రసాద్, డుంబ్రిగుడ మండలం పిట్టగుడకు చెందిన బురిడి రామకృష్ణ, ఒడిశా రాష్ట్రం కోరపుట్టు సమీపంలోని పాడువకు చెందిన పింకు బొర మారుతి.. కారులో విశాఖపట్నానికి గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పద్మనాభం పోలీసులు విజయానందపురం లేఅవుట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో గంజాయిని తరలిస్తున్న వీరిని పట్టుకున్నారు. కారుతో పాటు 123 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, వీరి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భీమునిపట్నం కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

సాగరతీరాన సాంస్కృతిక వైభవం

- ఏయూలో ప్రారంభమైన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్
- భిన్న సంస్కృతుల మేళవింపుగా సాగిన ర్యాలీ
- నృత్యాలతో జోష్ నింపిన విద్యార్థులు

ఏయూక్యాంపస్: డప్పుల చప్పుళ్లు.. థింసా, భాంగ్రా, మోహినియాట్టం నృత్యాలు.. తెయ్యం వేషధారణ.. అన్నమయ్య కీర్తనల ఆలాపనలు.. ఇలా విభిన్న సాంస్కృతిక కళారీతులకు ఆంధ్ర విశ్వ విద్యాలయం వేదికైంది. ఏయూలో శుక్రవారం ప్రారంభమైన 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యువభేరి)లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు తళుక్కుమన్నారు. తమ ప్రాంతం సంస్కృతిని జాతీయ స్థాయిలో పరిచయం చేశారు. సంప్రదాయ నృత్యాలతో పరవశింపజేశారు. ఈ నెల 9వ తేదీ వరకు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలోని 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏయూ పరిపాలన భవనం వద్ద సాయంత్రం విద్యార్థులతో సాంస్కృతిక ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ టెక్నికల్ అబ్జర్వర్ మనీష్ జంగ్రా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి అమెరికన్ కార్నర్, ఏయూ ఇన్‌గేట్, ఏయూ పాఠశాల, బీచ్‌రోడ్డు మీదుగా ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు సాగింది. ముందుగా న్యాయనిర్ణేతలు బ్యాటరీ వాహనంపై వెళుతూ విద్యార్థుల ర్యాలీని తిలకించారు. విద్యార్థులు తమ సంస్కృతి సంప్రదాయాలను, కళలను ప్రస్ఫుటం చేస్తూ ప్రత్యేక వస్త్రధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. సంగీత వాయిద్యాలకు అనుగుణంగా నర్తిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ది అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ(ఏఐయూ) కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, ఏయూ సహకారంతో నిర్వహిస్తోంది. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మనీష్ జంగ్రా మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. నంది అవార్డు గ్రహీత కె.మహేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ కళ.. సమాజ చైతన్యం కోసమేనన్నారు. తాను ఏయూ పూర్వవిద్యార్థిగా చెప్పుకోవడానికి గర్విస్తానన్నారు. ఫెస్ట్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఇందులో 23 వర్సిటీలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమాల నిర్వహణకు నాలుగు వేదికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేశారు. తొలి రోజు కార్యక్రమాలతో తీర్చిదిద్దిన ప్రత్యేక సంచికను వేదికపై ఏఐయూ ప్రతినిధులు విడుదల చేశారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు



ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



కృష్ణా వర్సిటీ విద్యార్థుల నృత్యహేళ



ప్రత్యేక వేషధారణలో అలరించిన విద్యార్థులు

హెచ్‌టీ వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్లు

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ బిల్లుల చెల్లింపులకు హెచ్‌టీ వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్ల (వాన్) కేటాయించినట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వాన్ నంబర్ల ప్రక్రియని కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ హెచ్‌టీ వినియోగదారుల బిల్లు చెల్లింపు సౌలభ్యానికి వర్చువల్ అకౌంట్ నంబర్లను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా కేటాయించామని తెలిపారు. వీరికి కేటాయించిన నంబర్లను వారి బ్యాంకు ఖాతాలకు అనుసంధానించుకోవడం ద్వారా బిల్లు చెల్లింపు లావాదేవీలు మరింత సులభతరం కానుందన్నారు. ఈ నంబరు ద్వారా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ఫైనాన్స్) డి.చంద్రం, సీజీఎంలు పి.శ్రీనివాస్, ఎం.రవీంద్ర, ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్, ఆర్ఎం ఐ.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

అల్లిపురం: లింక్ రైళ్ల ఆలస్యంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు–హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12864) శుక్రవారం 10.35 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరింది. చెన్నై సెంట్రల్–భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12839) ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా 11.30 గంటలకు బయలుదేరింది. ఈ రైలు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకుంటున్నాయి. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు.

విద్యార్థిని మృతదేహంతో ఆందోళన

- న్యాయం చేయాలని డిమాండ్
- అధికారులు నచ్చచెప్పడంతో విరమణ



నర్సింగపేట రహదారిపై బాలిక మృతదేహంతో ఆందోళన

కూనవరం : అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి ఆందోళనకు దారితీసింది. మండలంలో నర్సింగపేట ఆశ్రమ హైస్కూల్‌లో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన తల్లి, బంధువుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన మడలం సంధ్య (11) నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల రెండవ తేదీన నడుము నొప్పితో బాధపడుతున్న ఆమెను పాఠశాల యాజమాన్యం ఆయాతో కోతులగుట్ట సీహెచ్‌సీలో చేర్పించి చికిత్స అందించారు. కోలుకున్న తరువాత అదే రోజు సాయంత్రం ఆశ్రమ పాఠశాలకు ఆమె వచ్చేసింది. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పాఠశాల యాజమాన్యం ఆమె తల్లికి తెలియజేసింది. మరుసటి రోజు ఆమె తల్లి పాఠశాలకు వచ్చి సంధ్యను స్వగ్రామం ఎర్రబోరుకు తీసుకువెళ్లింది. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఇంటివద్ద విద్యార్థిని సంధ్య తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే అక్కడి నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందినట్టు తల్లి తెలిపింది. అనంతరం సంధ్య మృతదేహంతో శుక్రవారం ఆమె, కుటుంబ సభ్యులు, బంధువులు నర్సింగపేట ఆశ్రమ పాఠశాలకు చేరుకున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో సుజాత, ఎంఈవో బాలరాజు, ఎంఈవో–2 లక్ష్మయ్య అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను అక్కడి నుంచి చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు నివేదించారు. అనంతరం ధర్నా చేస్తున్న వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

సకాలంలో రేషన్ సరకుల పంపిణీ

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

దేవీపట్నం: తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో సరఫరా చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం దేవీపట్నం మండలంలో ఆయన పర్యటించారు. ఇందుకూరు, ఇందుకూరుపేట గ్రామాల్లోని రేషన్ షాపులు, మధ్యాహ్నం భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరఫరా, ఎంపీయూపీ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. హాజరైన సిబ్బంది, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఇందుకూరుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మందులు, సేవల వివరాలను తెలుసుకున్నారు. ఇదే గ్రామంలో ఎంపీ యూపీ స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి సూచలను చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆర్ అండ్ఆర్ కాలనీలను పరిశీలించి, నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి, మండల విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

విద్యుత్ ప్రమాద బాధితులకు ఐదేళ్లలో రూ.27.11 కోట్ల పరిహారం

ప్రమాదాలకు బాధ్యత విద్యుత్ సంస్థలదేనని స్పష్టం చేసిన ఏపీఈఆర్సీ

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపులో అనుసరిస్తున్న నిబంధనల విషయంలో వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త నిబంధనలను నిర్దేశిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గత నెలలో విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో సవరించిన (ఏపీఈఆర్సీ) రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం విద్యుత్ ప్రమాదం ఎలా జరిగినా.. దానికి కారకులు ఎవరైనప్పటికీ బాధితులకు సంబంధిత విద్యుత్ సంస్థలే పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి స్పష్టం చేసింది. వినియోగదారుల నివాస సముదాయాల్లోనూ, విద్యుత్‌ను వినియోగించే ప్రతిచోటా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా తనిఖీ చేసి, ఎక్కడా ఎలాంటి లోపం లేదని నిర్ధారించుకున్న తరువాతే అనుమతినివ్వాలని ఆదేశాలిచ్చింది. అదేవిధంగా విద్యుత్ సంస్థలు పరిహారం చెల్లింపు విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఏపీఈఆర్సీ సూచించింది. ఈ ఆదేశాలు తక్షణమే రాష్ట్రమంతటా అమలులోకి వస్తాయని ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది. విద్యుత్ వ్యవస్థ కారణంగా విద్యుదాఘాతానికి గురైన బాధితులకు ఈపీడీసీఎల్ సంస్థ సకాలంలో పరిహారం చెల్లిస్తోందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాల కారణంగా జంతువులు గాని, మనుషులు గాని మరణించినా, వికలాంగులైనా ప్రమాదానికి గల కారణాలను సంస్థ విచారించి తప్పిదం ఉన్నట్లు తేలితే బాధితులకు నష్ట పరిహారాన్ని నిబంధనల మేరకు ఏపీఈపీడీసీఎల్ ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని వివరించారు. గత ఐదేళ్లలో ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుదాఘాతానికి గురైన బాధితులకు సంస్థ చెల్లించిన నష్ట పరిహారం వివరాలను ఆయన ప్రకటించారు. ఏపీఈఆర్సీ నిర్దేశించిన నిబంధనల మేరకు సంస్థ విచారణ అనంతరం 2018 నుంచి 2023 వరకు విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మనుషులు, జంతువులు, గాయపడిన వారికి మొత్తంగా 931 మంది ప్రమాద బాధితులకు రూ.27.11 కోట్ల పరిహారాన్ని ఈపీడీసీఎల్ చెల్లించినట్లు తెలిపారు. ఇందులో 475 మందికి రూ.24.13 కోట్లు, 456 మంది జంతువుల యజమానులకు రూ.2.98 కోట్ల పరిహారాన్ని అందజేసినట్లు సీఎండీ పృథ్వీతేజ్ వివరించారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ఏటా కనకమహాలక్ష్మి అమ్మవారికి నిర్వహించే రథోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరగనుంది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

99 మద్యం సీసాలు, 3 లీటర్ల సారా పట్టివేత

బుచ్చెయ్యపేట: మండలంలో రెండు గ్రామాల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని, సారా అమ్ముతున్న మరొకరిని పట్టుకుని చోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం వడ్డాది జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా, గ్రామానికి చెందిన జి. అప్పారావు తన ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇతని వద్ద 93 క్వార్టర్ బాటిళ్లు, 6 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. చింతపాకలో సారా విక్రేత ఎస్. మత్స్యరాజును అదుపులోకి తీసుకుని, మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వడ్డాదిలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకుని రూ. 10 వేల అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: మండలంలోని పిల్లవానిపాలెం గ్రామానికి చెందినబుదిరెడ్ల శివను అరెస్ట్ చేశామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో సహా దాడి చేశామన్నారు. అతడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేశామన్నారు.

గ్రీన్‌పోర్టు దిశగా అడుగులు



జెండా ఊపి సీఎన్‌జీ బస్సులు ప్రారంభిస్తున్న చైర్మన్ డా.అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : పర్యావరణ హితంగా గ్రీన్ పోర్టుగా అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నామని విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. పోర్ట్ అవసరాల కోసం కొనుగోలు చేసిన రెండు సీఎన్జీ బస్సులను, రెండు భారీ రోడ్ స్వీపింగ్ యంత్రాలను అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్ట్ వాహన విభాగంలోకి మొట్టమొదటి సారిగా సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర భారత్‌లో భాగమని వెల్లడించారు. పోర్ట్ పరిసరాలలో స్వచ్ఛత పాటించడంలో కట్టుబడి ఉన్నామని, డాక్ ఏరియాలో ఉన్నత ప్రమాణాలతో పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే 3 ఏళ్లలో ఈ ప్రాజెక్ట్ కోసం రూ.9.68 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుతో పరిసరాల పరిశుభ్రత ప్రమాణాలు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ విభాగాధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.